ప్రజాశక్తి
సోమవారం 4 నవంబర్ 2024 5 విజయనగరం

పర్యాటక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

కార్తీక మాసం సందర్భంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్‌పి వకుల్ జిందాల్.. సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎక్కువ మంది నదులు, సముద్ర స్నానాలు ఆచరించే అవకాశం ఉందని తెలిపారు. పోలీసు స్టేషను పరిధిలోని నదీ స్నానాలు ఆచరించే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల వద్ద ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యువత నదుల్లో లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా బందోబస్తు, పెట్రోలింగు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ముఖ్యమైన శివాలయాలను గుర్తించి, బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. దొంగతనాలు జరగకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు.

పంచాయతీల్లో వెండర్ల వేడి రగులుతోంది. ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ పనులు మంజూరు నుంచి వాటి నిర్వహణ వరకు గ్రామ పంచాయతీలు, సర్పంచులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్న చర్చ సర్వత్రా సాగుతోంది. ఎమ్మెల్యేల ఒత్తిడి మేరకు ఎంపిడిఒ, మండల పంచాయతీరాజ్ ఇంజినీర్లు.. గ్రామసభల్లో తీర్మానించని పనుల మంజూరు కోసం కలెక్టర్ కార్యాలయానికి సిఫార్సు చేయడమే అందుకు కారణం. దీంతో జిల్లా వ్యాప్తంగా సర్పంచులు ఆందోళన వ్యక్తంచేస్తూ, అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

గ్రామసభలో టిడిపి నాయకులు

పంచాయతీలకు వెండర్ల వేడి

- వెండర్లకు బిల్లులిస్తే అధికారులకు చిక్కులే!
- ఆందోళన వ్యక్తం చేస్తున్న సర్పంచులు

ప్రజాశక్తి - జామి

చట్ట ప్రకారం గ్రామాల్లో ఏ పని చేపట్టాలన్నా గ్రామసభ లేదా పంచాయతీ పాలకవర్గం తీర్మానం తప్పనిసరి. కానీ టిడిపి నాయకులకు పనులు అప్పగించాలన్న దురుద్దేశంతో వెండర్ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారు. తాజాగా జామి మండలంలోని చింతాడలో గ్రామసభలో తీర్మానించిన పనులు కాకుండా, స్థానిక కాంట్రాక్టర్లు ఎంపిక చేసుకున్న పనులను మంజూరు చేయడమే అందుకు నిదర్శనం. అదే గ్రామంలో గతంలో నిర్మించిన సిసి రోడ్డుపై, ఉపాధి హామీ చట్టం నిబంధనలకు విరుద్ధంగా నాలుగు అడుగుల వెడల్పు గల సందులో రోడ్డు వేసేందుకు, ఒక ప్రయివేటు వ్యక్తి కల్లానికి కల్వర్టు నిర్మించేందుకు, రోడ్డు పేరిట ఓ ఆలయం ముందు ప్లాట్‌ఫాం వేసి నిధులు కొల్లగొట్టేందుకు సదరు కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కయ్యారని ఆ గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం ఆరోపించారు. ఒక్క చింతాడ పంచాయతీలోనే కాకుండా మిగిలిన పంచాయతీలన్నింటా ఇదే తంతు నడుస్తోందని సర్పంచులు గగ్గోలు పెడుతున్నారు. గ్రామసభల్లో తీర్మానించిన పనుల్లో ప్రాధాన్యత క్రమాన్ని విస్మరించి అధికార టిడిపి, జనసేనకు చెందిన కాంట్రాక్టర్లు చెప్పిన పనులను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. దీని వల్ల ప్రజలు కోరుకున్న రోడ్లు, డ్రెయిన్లు వేయలేని పరిస్థితి గ్రామాల్లో నెలకొంది.

కోర్టుకు వెళ్తే చిక్కులే

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పనులు చేపట్టకుండా, సర్పంచులకు సంబంధం లేకుండా వెండర్ పేరిట టిడిపి, జనసేన కాంట్రాక్టర్లకు ఉపాధి పనులు కట్టబెడుతున్నారు. ఇప్పటికే ఎంపిడిఒలు గ్రామాల వారీగా ఆయా పార్టీల నాయకులనే వెండర్లుగా గుర్తించి అగ్రిమెంట్లు చేయాలని చూస్తున్నారు. ఏదైనా ఒక పంచాయతీలో వెండరును ఎంపిక చేయాలంటే సదరు పంచాయతీ పాలకవర్గం తీర్మానించాలి. ఆ తీర్మానాన్ని అనుసరించే ఎంపిడిఒ వెండర్‌కు సిఫార్సు చేయాలి. కానీ అధికారులు గుర్తించిన జాబితాలో వెండర్ అర్హత లేనివారే ఎక్కువగా ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అన్యాయంపై ఏ ఒక్క పంచాయతీ సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించినా స్టే వస్తుందని, అన్యాయంగా వ్యవహరిస్తున్న అధికారులంతా కోర్టు ముందు తలదించుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఉపాధి హామీ చట్టానికి తూట్లు

వెండర్ అంటే మెటీరియల్ సరఫరాదారు లేదా అమ్మకందారు అని అర్థం. సిమెంట్, మెటల్, ఐరన్ తదితర మెటీరియల్ వ్యాపారాలు చేస్తున్నట్లుగా వారికి జిఎస్‌టి ఉండాలి. ప్రస్తుతం అదే వ్యాపారంలో ఉన్నట్లు నిర్ధారించుకోవాలి. అటువంటి వారి నుంచే గ్రామ పంచాయతీలు మెటీరియల్ సమకూర్చుకోవాలి. వారికే ఎంపిడిఒ చెల్లింపులు చేయాలి. అలా కాకుండా టిడిపి, జనసేన కార్యకర్తలకు బిల్లులు చెల్లిస్తే అధికారులకు చిక్కులు తప్పవని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం 40 శాతం పనులు గ్రామ పంచాయతీ ద్వారానే చేపట్టాలి. కానీ గ్రామ పంచాయతీల తీర్మానాలు లేకుండానే వెండర్లను ఎంపిక చేసి నిధులను దుర్వినియోగం చేయడం ఉపాధిహామీ చట్టానికి తూట్లు పొడవడమేనని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు సహా అనేకమంది నిపుణులు చెబుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే

జిల్లాలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వెండర్ విధానానికి సిఫార్సు చేశాం. జిల్లా వ్యాప్తంగా అదే జరుగుతోంది. చట్ట ప్రకారమే నడుచుకుంటున్నాం.

- నీలం అప్పలనాయుడు, ఎంపిడిఒ, జామి

నిర్లక్ష్యమా? గుండెపోటా?

- వసతిగృహ విద్యార్థి మృతిపై అనుమానాలు
- వార్డెన్ తీరుపై విమర్శలు

మృతిచెందిన విద్యార్థి శ్యామలరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కాటవీధిలో ఉన్న బిసి వసతిగృహంలో ఏడో తరగతి చదువుతున్న చదువుతున్న విద్యార్థి కొణతాల శ్యామలరావు(12) మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం ఉదయం టిఫిన్ చేసిన అనంతరం అరగంట వ్యవధిలోనే విద్యార్థి మరణించాడు. ఏమీ జరగకపోతే ఆరోగ్యంగా ఉన్న తమ బిడ్డ ఎలా మరణించాడని కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. వసతిగృహంలో సంక్షేమ అధికారి, సిబ్బంది నిర్లక్ష్యమా? లేదా వైద్యులు అనుమానిస్తున్నట్లు గుండెపోటుతో మరణించాడా? లేక మరే ఇతర కారణమా? అనేది తేలాల్సి ఉంది. ఇదే విషయంపై కుటుంబ సభ్యులతోపాటు, ఎస్ఎఫ్ఐ నాయకులు, బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కూడా సందేహం వ్యక్తం చేశారు. విద్యార్థి మృతదేహం, కళ్లు పచ్చగా కనిపిస్తున్నాయి. దీంతో ఏమైనా పచ్చకామెర్ల ఉన్నాయా? అని అనుమానం వ్యక్తమవుతోంది. 'సరదాగా ఉన్నాడు. టిఫిన్ చేసిన అనంతరం ఉన్నఫలానా నీరసంగా ఉందని చెబితే సపర్యాలు చేశాం. నీరు అడిగాడు. ఇచ్చినా తాగాలేదు' అని తోటి విద్యార్థులు చెబుతున్నారు.

పక్కనే ప్రయివేటు ఆస్పత్రి ఉన్నా..

కళ్లు తిరిగి పడిపోయిన విద్యార్థిని.. సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి, అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. దీంతో వసతిగృహం పక్కనే ఉన్న ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లి ఉంటే బతికేవాడని విద్యార్థి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. వార్డెన్, సిబ్బంది నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని మండిపడ్డారు.

పోస్టుమార్టం నివేదిక వస్తేనే..

ఆస్పత్రికి వచ్చేటప్పటికే విద్యార్థి మరణించినట్లు జిల్లా సర్వజన ఆస్పత్రి వైద్యులు కూడా చెప్పారు. అంతే తప్ప ఏ కారణంతో మరణించాడనేది చెప్పలేకపోయారు. విద్యార్థి మృతిపై బిసి, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత స్పందించారు. విద్యార్థి మరణంపై విచారం వ్యక్తంచేసిన మంత్రి... మృతిపై పూర్తి వివరాలను తక్షణమే అందజేయాలని బిసి సంక్షేమ శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కూడా 24 గంటల్లో నివేదిక అందించాలని చెప్పారు. విద్యార్థి మృతదేహానికి రెండో పట్టణ పోలీసుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్ట్‌మార్టం నివేదిక వస్తే విద్యార్థి మరణం వెనుక కారణాలు తెలియాల్సి ఉంది.

వసతిగృహం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వార్డెన్ నిర్లక్ష్యం

వసతిగృహ విద్యార్థి శ్యామలరావు మరణానికి వార్డెన్ జానకిరాం నిర్లక్ష్యమే కారణమంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వార్డెన్ జానకిరాం గతంలో కూడా అనేక సార్లు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారని చెబుతున్నారు. హాస్టల్‌కు ఎన్నో సార్లు గైర్హాజరవుతూ విద్యార్థులను పట్టించుకునే వారు కాదని మండిపడ్డారు. వార్డెన్‌పై నమ్మకంతోనే తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్లో చేర్పిస్తారని, అలాంటి విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరి ంచడం దారుణమన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్, సిబ్బందిని సస్పెండ్ చేయాలని, విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు వసతిగృహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు.

చెరువు ఆక్రమించిన ఏర్పాటుచేసిన ప్రహరీ

ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టానుసారంగా వెంచర్లను వేస్తున్నారు. ముఖ్యంగా చెరువు, కొండ ప్రాంతాల్లో ఉన్న పొలాలను టార్గెట్‌గా పెట్టుకుని కొనుగోలు చేసి ఆ జిరాయితీ భూములను ఆనుకుని ఉన్న కొండ, చెరువు ప్రాంతాలను దర్జాగా కబ్జా చేసి వెంచర్లలో కలిపేసుకుంటున్నారు. వాటిని కలిపి రిజిస్ట్రేషన్లు కూడా చేయించేస్తున్నారు. అధికారులు కూడా మామ్మూళ్ల మత్తులో మునిగిపోయి కనీసం పరిశీలించకుండా రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. ఫలితంగా చెరువులు, కొండపోరంబోకు, ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయి. తాజాగా కొండవెలగాడ సమీపంలో ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి కొండవెలగాడ, రోళ్లవాక గ్రామాలకు వెళ్లే రహదారినే పూర్తిగా పక్కకు నెట్టేసి రోడ్డు మధ్యలో నుంచి వెంచర్ వేశాడు. దీంతో ఆ రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు మధ్యలో నుంచి గోడ నిర్మాణం చేసుకోవడంతో రాకపోకలు ఆగిపోయాయి. పైగా అదే రియల్ వ్యాపారి తన వెంచర్‌ను ఆనుకుని ఉన్న సీతమ్మ చెరువులో సుమారు 9 ఎకరాలు కబ్జా చేసినట్లు కొండవెలగాడ గ్రామస్తులే ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆక్రమణ ఎందుకు 'మిత్ర'మా?

- 9 ఎకరాల చెరువును కబ్జా చేసిన రియల్ వ్యాపారి
- రోడ్డును సైతం పక్కకు నెట్టేసి వెంచర్ ఏర్పాటు
- రెండు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండవెలగాడలో రియల్ ఎస్టేట్ యజమాని సీతమ్మ చెరువు, రోళ్లవాక వెళ్ళే రహదారి ఆక్రమించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఇప్పటికే లోక్ అదాలత్‌లో కూడా కొంత మంది కేసు వేసినట్లు సమాచారం. కొండవెలగాడకు చెందిన సీతమ్మ చెరువు, రోళ్ళవాక రహదారిని ఒక రియల్ ఎస్టేట్ యజమాని ఆక్రమణ చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సీతమ్మ చెరువు సర్వే నెంబర్ 266, రోళ్ల వాక రహదారి (రాస్తా) సర్వే నెంబర్ 288 రియల్ ఎస్టేట్ యజమాని ఆక్రమించుకొని అడ్డుగా గోడ కట్టేశారని రైతులు ఆరోపిస్తున్నారు. సుమారు 59 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులో సుమారు 9 ఎకరాలను కబ్జా చేసినట్లు తెలిస్తోంది. చెరువు ఆక్రమణకు గురి కావడంతో కొండవెలగాడతో బాటు, చంద్రంపేట, తుమ్మలపేట, గరికిపేట, కొండగుంపాం, జరజాపుపేట గ్రామాల రైతులకు సాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని రైతులు చెబుతున్నారు. కొండ వెలగాడ నుంచి రోళ్ళవాక వెళ్ళే రహదారి కూడా సదరు రియల్ ఎస్టేట్ యజమాని ఆక్రమించుకొని అడ్డుగా గోడ కట్టేయడంతో గత 50 సంవత్సరాలుగా కొండవెలగాడ నుంచి బొండపల్లి మండలం రోళ్లవాక వెళ్లే రహదారి పూర్తిగా కనుమరుగైపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి చంద్రం పేట మీదుగా రోళ్లవాక వెళ్ళే పరిస్థితి ఏర్పడింది.

కొన్నది కొంత ..
కబ్జా చేసింది ఇంకొంత..

సదరు రియల్ ఎస్టేట్ యజమాని 29.40ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో చూపిస్తున్నారు. కాని సర్వే నెంబర్ 261-4లో 62సెంట్లు మెట్టు భూమి, సర్వే నెంబర్ 262-5లో 2.88 ఎకరాల మెట్ట భూమి, సర్వే నెంబర్ 267-1లో 30 సెంట్లు మెట్ట భూమి పట్టా దారుగా రికార్డుల్లో నమోదైంది. ఈ మూడు సర్వే నెంబర్లలో గల మెట్ట భూమి రియల్ ఎస్టేట్ యజమానికి ఎలా వచ్చిందని, కనుగోలు చేస్తే కనుగోలుదారుగా నమోదవుతుంది గాని పట్టా దారుగా ఎలా నమోదవుతోందని అలా నమోదయ్యే అవకాశం లేదని, ఈ మూడు సర్వే నెంబర్ గల భూమి ఆక్రమించుకున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కొండవెలగాడ పరిధిలో అక్రమ లే అవుట్ వేశారని లోకాయుక్తలో గ్రామానికి చెందిన ఒక రైతు కేసు వేయగా లోకాయుక్త గ్రామ పరిధిలో లే అవుట్ వివరాలు ఇవ్వాలని చెప్పడంతో పంచాయతీ అధికార్లు రియల్ ఎస్టేట్ యజమానికి 20.35సెంట్ల భూమికి అనుమతి ఇచ్చినట్లు సమాచారం. వాస్తవానికి ఆయన కొన్నది 20 ఎకరాలైతే రికార్డుల్లో 29 ఎకరాలు ఎలా నమోదైందని రైతులు ప్రశ్నిస్తున్నారు. రియల్ ఎస్టేట్ యజమాని 9ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్నట్లు రైతులు చెబుతున్నారు. దీనిపై సమగ్ర ధర్యాప్తు చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చదువును సరుకుగా మార్చేస్తున్న రాజకీయం

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - జామి

చదువును సరుకుగా మార్చేసిన రాజకీయ వ్యవస్థ.. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రయివేటు విద్యారంగాన్ని పూర్తిగా కార్పొరేట్లకు అప్పగించే పనిలో ఉందని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివారం జామిలోని అల్లువీధి ప్రభుత్వ పాఠశాలలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఉపాధ్యాయులు హక్కుల కోసం పోరాడుతూనే, సమాజంలో డబ్బులుంటే మంచి చదువు కొనుక్కోవచ్చన్న ఆలోచనా విధానంపై ఉద్యమించాల్సి ఉందని సూచించారు. వ్యాపారులంతా రాజకీయాల్లోకి వచ్చి, ప్రభుత్వ విద్యను నాశనం చేసే కుట్రను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుడికి, విద్యార్థికి ఉన్న సంబంధం కొనుక్కుంటే రాదని చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టంచేశారు. విద్య నేర్చుకోవాలంటే ఉపాధ్యాయుడే ప్రధానమన్న ఆలోచనా ధోరణి ప్రజలకు కలిగించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రాజారావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముందుగా యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు కొత్తలి వెంకటరావు జెండా ఆవిష్కరించారు. అనంతరం జామి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా వి.వాసుదేవరావు, ఎం.తాతం నాయుడును ఎన్నుకున్నారు. ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని, జిఒ నెంబర్ 117ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నూతన కార్యవర్గం తీర్మానించింది. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్, జి.వెంకటరావు, ఎం.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

మహాసభకు విరాళాలివ్వండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 16, 17వ తేదీల్లో విజయనగరంలో జరిగే సిపిఎం పదో జిల్లా మహాసభకు విరాళాలివ్వాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు కోరారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఫూల్‌బాగ్, వుడాకాలనీ, తోటపాలెంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో, నగరంలో ప్రజా సమస్యలపై సిపిఎం అనేక పోరాటాలు చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టిందని చెప్పారు. మహాసభ జయప్రదం కోసం, భవిష్యత్తు పోరాటాల కోసం ప్రజలు విరాళాలిచ్చి సిపిఎంను ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం విరాళాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, ఎ.జగన్ మోహన్, నగర కమిటీ సభ్యులు బి.రమణ, వి.రామచంద్రరావు, వి.లక్ష్మి, రంభ శ్రీను, డి.కరుణ, తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ముమ్మరంగా పూడికతీత

విజయనగరం టౌన్ : నగరంలోని ప్రధాన కాలువల్లో పూడిక తీత పనులను ప్రజారోగ్య సిబ్బంది ముమ్మరం చేశారు. గణేష్ కోవెల దరి, నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఉన్న ప్రధాన కాలువల్లో జెసిబిల సహాయంతో చెత్తాచెదారాలను తొలగించారు. ఆరుబయట గాని, కాలువల్లో గాని చెత్తాచెదారాలు వేయరాదని వ్యాపారులకు కమిషనర్ పి.నల్లనయ్య సూచించారు.

ఉద్యోగాలకు ఎంపికైన వారితో సుందరం ఫాస్టనర్స్, సీతం కళాశాల ప్రతినిధులు

సీతంలో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం టివిఎస్ సుందరం ఫాస్టనర్స్ ఆధ్వర్యాన ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఇందులో ఎలక్ట్రికల్, మెకానికల్, ఇసిఇ విద్యార్థులు పాల్గొన్నారు. 30 విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ ప్రక్రియను సుందరం ఫాస్టనర్స్ హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ ఆదినారాయణ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ దేవరాజ్ పర్యవేక్షించారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్న సుందరం ఫాస్టనర్స్ తమ కళాశాల విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సీతం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, ప్లేస్‌మెంట్స్ డీన్ షాజీనాయర్ , బికె రావు, తదితరులు పాల్గొన్నారు.

మార్చి 31లోపు పూర్తిచేయని ఇళ్లకు రుణసాయం రద్దు

- ఇప్పటికే 10వేల ఇళ్ల రద్దుకు ప్రతిపాదనలు
- ఏప్రిల్ నుంచి పిఎంఇవై 2.0 పథకం అమలు
- గుంకలాంలో రోక్‌క్రిట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీపై విచారణ
- 'ప్రజాశక్తి'తో గృహనిర్మాణ శాఖ పీడీ కూర్మినాయుడు ముఖాముఖి

ప్రజాశక్తి - విజయగనరం ప్రతినిధి

వచ్చే ఏడాది మార్చి 31లోపు నిర్మాణాలు పూర్తికాని (1.0-పిఎంఇవై) ఇళ్లకు ప్రభుత్వ రుణసాయం రద్దు అవుతుందని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పొన్నాడ కూర్మినాయుడు వెల్లడించారు. ఈ స్థానంలో కొత్తగా పిఎంఇవై -2.0 పథకం అమల్లోకి రానుందని తెలిపారు. ఈలోపు పాత ఇళ్ల నిర్మాణాలు లబ్ధిదారులు పూర్తిచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జిల్లాలో 10,206 ఇళ్ల రద్దుకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపామని తెలిపారు. గుంకలాం, కొండకరకాం కాలనీల్లో ఆప్షన్ -3 కింద రోక్‌క్రిట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణ సాగుతోందని చెప్పారు. తిరిగి ప్రభుత్వ ఆదేశాలు వచ్చేంత వరకు ఆ కంపెనీ చేపట్టిన ఇళ్ల బిల్లులు ముందుకు సాగబోవని స్పష్టం చేశారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...



గత ప్రభుత్వంలో పిఎంఇవై కింద జిల్లాలో ఎన్ని ఇళ్లు మంజూరు చేశారు.?

పిఎంఇవై 1.0 పథకం కింద ఒక్కో ఇంటికి రూ.1.80లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో 81,999 ఇళ్లను మంజూరు చేశారు. ఇందులో పూర్తిచేసినవి కేవలం 43,328 మాత్రమే. మిగిలిన 27,499 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. 11,172 ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా ప్రారంభం కాలేదు. బిల్లుల విషయంలో ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నాం. ఎందుకంటే వచ్చే ఏడాది మార్చి 31 నుంచి పిఎంఇవై రుణాలు రద్దు అవుతాయి.

రుణసాయం ఎందుకు రద్దవుతుంది? ఎంతమంది కోల్పోయే అవకాశం ఉంది.?

ప్రభుత్వం సమాచారం ప్రకారం.... గత ప్రభుత్వ హయాంలో పిఎంఇవై -1.0 పథకం ద్వారా మంజూరు చేసిన రుణసాయం 2025 మార్చి 31తో ముగిసిపోతుంది. ఆ స్థానంలో పిఎంఇవై-2.0 పథకం ప్రారంభమౌతుంది. లబ్ధిదారులు పనులు వేగవంతం చేయడం ద్వారా బిల్లులు పూర్తిస్థాయిలో పొందవచ్చు. లేదంటే మార్చి 31వ తేదీ తరువాత బిల్లులు చేయడానికి కంప్యూటర్ కూడా సహకరించే పరిస్థితి ఉండదు. ఈలెక్కన జిల్లాలో ఇప్పటికీ పనులు ప్రారంభించని 11,172 ఇళ్లలో 10,206 ఇళ్ల రద్దుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

కొత్త పథకం ఎప్పటి నుంచి ప్రారంభం అవుతుంది?

2025 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే పిఎంఇవై -2.0 అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఆ వెంటనే అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక డిమాండ్ సర్వే యాప్ తయారు చేసింది. కొత్త యాప్ ప్రకారం దరఖాస్తుకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జతచేసి, దరఖాస్తులో బ్యాంకు అకౌంట్ నెంబర్, ఫోన్ నెంబర్ పొందుపరిస్తే సరిపోతుంది. సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వీటిని అప్‌లోడ్ చేయనున్నారు. ఇందుకనుగుణంగా ఇప్పటికే వారికి ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది.

రోక్‌క్రిట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ కంపెనీ ఎన్ని ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది.?

గుంకలాం, కొండకరకాం కాలనీల్లో ఆప్షన్ -3 కింద మొత్తం 7,198 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వీటిని 20మంది కాంట్రాక్టుకు తీసుకున్నారు. వీరిలో అత్యధికంగా 5097 ఇళ్లను రోక్‌క్రిట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ చేపట్టింది. ఇందులో 99.78 గ్రౌండింగ్ చేసి రూ.25.40 కోట్ల మేర బిల్లులు పొందింది.

రోక్‌క్రిట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ నిర్మాణాల బిల్లులు ఎందుకు నిలిపివేశారు.?

మూడో తరహా (ఆప్షన్ -3)లో అత్యధికంగా ఇళ్లను నిర్మించింది రోక్‌క్రిట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ కంపెనీయే. వాటిపై అభియోగాలు ఉండడంతో ప్రభుత్వం ప్రస్తుతం విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే బిల్లుల నిలిపివేతకు ఆదేశాలు జారీచేసింది.

నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బద్దుకొండ అప్పలనాయుడు

పార్టీ నిర్ణయించిన వ్యక్తిని గెలిపించుకోవాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పార్టీ నిర్ణయించిన వ్యక్తిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే బద్దుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని తెర్లివలసలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అధిష్టానం ఏ పేరును ప్రకటిస్తే వారి గెలుపుకు కోసం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి మహంతి కళ్యాణి, నాయకులు మహంతి జనార్దన్, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, మహంతి శ్రీనివాసరావు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్‌ను కొనసాగించాలి

ఉత్తరాంధ్ర కాంట్రాక్టు లెక్చరర్ల ఐక్యవేదిక డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గతేడాది చేపట్టిన కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ ప్రక్రియను కొనసాగించాలని ఉత్తరాంధ్ర కాంట్రాక్టు లెక్చరర్ల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక జెఏసి సమావేశ మందిరంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'ఉత్తరాంధ్ర కాంట్రాక్టు లెక్చరర్ల గళం' పేరిట సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రెగ్యులరైజేషన్‌తోపాటు కాంట్రాక్టు లెక్చరర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రతినిధులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా రెగ్యులరైజేషన్ చేయట్లేని, కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసును 62 ఏళ్లకు పొడిగించాలని సదస్సులో తీర్మానాలు చేశారు. వి.శేఖర్, కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో జూనియర్ కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పాల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పాల రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం ప్రాంతీయ బాధ్యులు మద్దిల రమణ శివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగ్గించిన పాల ధరను వెనక్కి తీసుకుని పాల రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, పాల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుద్ధరాజు రాంబాబు, పాల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు లోకవరపు ఆదినారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి గొంప కృష్ణమూర్తి, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, పాల రైతు సంఘాల నాయకులు పాల్గొంటారని పాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో శ్రావణికి రజతం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని టెక్కలి గ్రామానికి చెందిన జి. శ్రావణి ఆంధ్ర యూనివర్సిటీలో జరుగుతున్న ఇంటర్ యూనివర్సిటీ కాంపిటీషన్స్‌లో విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరఫున వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఏ ఎకనామిక్స్ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రావణి గతంలో రెండుసార్లు రాష్ట్ర స్థాయిలో బహుమతులను సాధించింది. ఇటీవల పైడితల్లమ్మ ఉత్సవంలో భాగంగా జిల్లా స్థాయిలో మొదటి బహుమతిని గెలుచుకున్నారు. సిల్వర్ మెడల్ రావడం పట్ల పీడీ డాక్టర్ పి.జయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ అభినందనలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సివిల్ సప్లై శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ని భోగాపురంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశామని జనసేన నాయకులు వబ్బిన సన్యాసినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో అన్‌ఫిట్ పేరుతో 170 మంది ఆర్‌టిసి ఉద్యోగులను తొలగించారని జిఒ 2015/19 ప్రకారం అప్పటి టిడిపి ప్రభుత్వ వారి కుటుంబ సభ్యులకి ఆర్‌టిసిలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, సదరు జిఒని అమలు చేయాలని కోరామన్నారు. మండలంలోని తిమిడి హైస్కూల్ గ్రౌండ్ సుమారు ఎకరం విస్తీర్ణం కబ్జాకు గురైందని సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకొని స్కూలుకు అప్పగించాలని కోరినట్లు వెల్లడించారు. జనసేన నాయకుడు వబ్బిన సతీష్, ఆర్‌టిసిఉద్యోగి కొలా సత్తిబాబు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రావాడ పంచాయతీ గొల్లపేటలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్న వాహనాలను గ్రామస్తులు ఫిర్యాదుతో పోలీసులు ఆదివారం అడ్డుకున్నారు. సుమారు ఐదు ట్రాక్టర్లు, ఒక జెసిబి తవ్వకాలు వద్ద పట్టుకున్నప్పటికీ ఇందులో కేవలం ఒక జేసిబీ ఒక ఒక ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకోవడంపై స్థానికులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు కొంతమంది తీసిన వీడియోల్లో రెండు మూడు ట్రాక్టర్లు కనబడుతున్నాయి. విశాఖ జిల్లా ఆవనాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సొంత జెసిబి నాలుగు ట్రాక్టర్లతో ఈ ప్రాంతంలో ఎక్కువగా మట్టి అక్రమ తవ్వకాలు చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

సముద్ర స్నానాల్లో అప్రమత్తం

ప్రజాశక్తి- భోగాపురం

కార్తీక మాసం సందర్భంగా సముద్ర స్నానాలకు వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి మెరైన్ సిఐ బి.వి.జే.రాజు అన్నారు. తీర ప్రాంత గ్రామాలైన చింతపల్లి, కంచేరు, చేపల కంచేరు, తిప్పలవలస, ముక్కాం గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తీక మాసం పురస్కరించుకొని సముద్ర స్నానాలకు వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సముద్ర తీర ప్రాంతంలో సముద్రపు లోతు ఎక్కువగా ఉంటుందని, అలలు తీవ్రత కూడా ఎక్కువగా ఉన్నందున ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, స్నానానికి వచ్చే భక్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలను, సందర్శకులను అప్రమత్తం చేసి, ప్రమాదాల పట్ల అవగాహన కల్పించారు. తీర ప్రాంతాలల్లో ప్రజలను, సందర్శకులను అప్రమత్తం చేస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫైర్ చెస్ స్కూల్, శ్రీ చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెస్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ఓపెన్ కేటగిరీలో విజేతగా సిహెచ్. వినీల్ రాధా కార్తీక్, ద్వితీయ స్థానంలో ఎం.కార్తీక్ నిలిచారు. బాలికల విభాగంలో విజేతగా కె.మోక్ష, రన్నర్‌గా ఎన్.అమృత నిలిచారు. విజేతలుగా నిలిచిన వారు ఈ నెల 18, 19, 20న తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పి.అర్చన, ఎన్.పద్మ, ఎ.దామోదరరావు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 50వ డివిజన్ పరిధిలో వైఎస్ఆర్ నగర్‌కు చెందిన పలువురు వైసిపి నుంచి జనసేన పార్టీలో చేరారు. ఆదివారం వైఎస్ఆర్ నగర్ ప్రధాన రహదారిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వీరికి జనసేన నాయకులు అవనాపు విక్రమ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జిల్లాలోని జనసేన పార్టీని మరింత బలోపేతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పి.వెంకటరావు, పి.అప్పలరాజు, తురాల శ్రీను, పి.చక్రవర్తి, పిడుగు సతీష్, సంపత్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలకు ముసుగులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో నగరంలో ఎన్నికల కోడ్ అమలైంది. నగర పరిధిలో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది ముసుగులు తొడిగారు. కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాలతో ప్రణాళిక అధికారులు ఆదివారం చర్యలు చేపట్టారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగినట్లు కమిషనర్ తెలిపారు.

అక్రమ వ్యాపారాలకు అడ్డాగా దాబాలు

- మద్యే మార్గంగా మాదక ద్రవ్యాల విక్రయాలు
- మద్యపాన ప్రియులకు నిత్య ఆవాసం
- లంచాల మత్తులో నిఘా వర్గాల ఉదాసీనత

ప్రజాశక్తి-రామభద్రపురం

దాబాలు అక్రమ వ్యాపారాలకు అడ్డాగా మారుతున్నాయి. ఇటీవల రామభద్రపురం మండలం ఆరికతోట గ్రామ సమీపంలోని భజరంగ్ రాజస్థానీ దాబాలో నల్లమందును యజమానే విక్రయిస్తూ పట్టుబడటమే అందుకు నిదర్శనం. జిల్లాలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న దాబాల్లో ఈ అక్రమ దందా మరింత జోరుగా సాగుతోంది. మరోవైపు మందుబాబులకు దాబాలు అడ్డాగా మారాయి.

జిల్లాలోని జాతీయ రహదారి-26కు ఆనుకొని ఉన్న దాబాల్లో అక్రమ వ్యాపారాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి బతుకు తెరువు కోసం వచ్చిన దాబా యజమానుల్లో కొందరు ఆహార పదార్థాల మాటున అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారు. గతంలో రామభద్రపురం మండల పరిసర ప్రాంతాల్లో గంజాయి, గుట్కా, ఖైనీ వంటి మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన సంఘటనలు కోకొల్లలు. కానీ ఇప్పుడు బ్లాక్ హెరైన్ (నల్లమందు) కూడా సరఫరా చేస్తూ పట్టుబడడం ఇదే ప్రథమం. రామభద్రపురం మండలం ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు సరిహద్దులో ఉంది. దీంతో మండలం మీదుగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా సులభతరమని పలువురు భావిస్తున్నారు. అందుకే మండలం మీదుగా గుట్టుచప్పుడు కాకుండా మాదకద్రవ్యాల రవాణా సాగిస్తున్నారు. గతంలో స్థానిక పోలీసులు.. గంజాయి, గుట్కా, ఖైనీ వంటి మత్తు పదార్థాలు పట్టుకున్న ఘటనలు అనేకం. అయితే ఈ నల్లమందు విక్రయానికి పాల్పడిన రాజస్థానీయుడు. ఆ రాష్ట్రంలోని బర్మార్ జిల్లా మండలి మండలం కోర్నా గ్రామానికి చెందిన రాజేష్ చౌదరి అలియాస్ రాజేష్... రాజస్థాన్ నుంచి నల్లమందు తీసుకొచ్చి ఆ దాబాకు వచ్చిన లారీ డ్రైవర్లకు సరఫరా చేస్తుండటం గమనార్హం.

'రాత్రి' వ్యాపారాలు

ఆరికతోట పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న హరి పంజాబీ దాబాలో రాత్రి 10 గంటల తరువాత గుట్టుచప్పుడు కాకుండా అక్రమ వ్యాపారం

ఆరికతోట సమీపంలో ఉన్న న్యూ రాజారంగ రాజస్థానీ దాబా

చేస్తున్నట్లు సమాచారం. సుదూర ప్రాంతాల నుంచి విశాఖకు రవాణా చేసే.. ఐరన్, సిమ్మెంట్ లైమ్ స్టోన్, వంటగ్యాస్, దాణా వస్తువులు, బియ్యం, నూకలు వంటివి లారీల్లోనుంచి తస్కరించి అక్రమ వ్యాపారం చేస్తున్నారు. లారీల్లో నుంచి స్థానిక కళాసీలతో కొంత మేర సరుకు దించి, ఖాళీ అయిన బరువుకు సరి సమానంగా రాళ్లు నింపుతున్నారు. ఇలా అక్రమ వ్యాపారం ద్వారా రూ.లక్షలు వెనకేసుకుంటున్నట్లు సమాచారం. ఈ అక్రమ వ్యాపారాలకు సహకరిస్తున్న వారికి కూడా భారీగా గిట్టుబాటు అవుతున్నట్లు తెలిసింది. ఇటీవల ఆరికతోట చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు గృహ నిర్మాణాలకు అతిచౌకగా ఐరన్ కొనుగోలు చేస్తున్నారు. జిఎస్‌టి కూడా లేకుండా తక్కువ ధరకు నచ్చిన సరుకు దొరకడంతో 'రాత్రి' వ్యాపారాలకు కొనుగోలుదారుల్లో పోటీ పెరిగింది.

తనిఖీ చేసేవారేరీ?

దాబాల్లో తినే ఆహార పదార్థాలు రుచి, శుచి ఉండే పరిస్థితులు లేవు. ధరల వివరాలు ఇక్కడ కనిపించవు. బిల్లు ఇచ్చే పరిస్థితే లేదు. రోజుకు రూ.లక్షల్లో వ్యాపారం సాగినా ప్రభుత్వానికి జిఎస్‌టి రూపంలో పైసా కూడా వచ్చేది లేదు. ఇకపోతే నాన్‌వెజ్ ప్రియులకు వారు తినేది తాజాదా? లేక వారం క్రితం కొని చెల్లకుండా మిగిలి ఫ్రిజ్‌లో ఉంచి వండి వడ్డించారో? తెలియకుండా నిషేధిత రంగులు, టేస్టింగ్ సాల్ట్ వంటి వాటితో కవర్ చేస్తున్నట్లు తెలిసింది. ఇకనైనా నిఘావర్గాలు వీటిపై కన్నేసి అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

బహిరంగంగా మద్యపానం

జాతీయ రహదారి వెంబడి ఉన్న దాబాలు మద్యపాన ప్రియులకు ఆవాసాలుగా మారుతున్నాయి. సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి వరకు మద్యపాన ప్రియులతో బల్లలు ఫుల్ అవుతున్నాయి. బహిరంగంగా మద్యం సేవిస్తున్నా అడ్డుకునే వారు కరువయ్యారు. కొన్నిచోట్ల అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

దాబాలపై నిఘా వేస్తాం

ఇటీవల ఒక దాబాలో నల్లమందు దొరకడంతో అప్రమత్తమై నిఘా ఉంచాం. దాబాల వద్ద రాత్రివేళ అక్రమ వ్యాపారాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంది. సిబ్బందితో గస్తీ ముమ్మరం చేసి అక్రమ వ్యాపారాలు చేయకుండా చర్యలు తీసుకుంటాం. దాబాల్లో మద్యపానం చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. రాత్రి 11 గంటల్లోపే దాబాల్లో విక్రయాలు ముగించే ఏర్పాట్లు చేస్తాం.

- ఎస్.నారాయణరావు, బొబ్బిలి రూరల్ సిఐ

సేంద్రియ వ్యవసాయమేది ?

- గ్రామాల్లో పత్తా లేని సిబ్బంది
- రైతుకు కొరవడుతున్న సూచనలు
- తెగుళ్లతో తప్పని అవస్థలు

ప్రజాశక్తి- మెంటాడ

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులను బలోపేతం చేయడం, వారికి చేయూతనివ్వడం కోసం సేంద్రీయ వ్యవసాయం చేయాలని ధృఢ సంకల్పించింది. సేంద్రియ వ్యవసాయం చేయడం వల్ల రసాయనికి ఎరువులు పురుగు మందులు ఖర్చులు తగ్గడమే కాకుండా పంట దిగుబడి బాగా పెరుగుతుందని సేంద్రీయ వ్యవసాయం ద్వారా పండించిన పంటలు తింటే అనారోగ్యం పాలవ్వరని ముఖ్యోద్దేశం. అయితే రైతులకు సూచనలు సలహాలు ఇస్తూ పంటలు బాగా పండించాలని ఇందుకోసం వ్యవసాయ అధికారి పరిధిలో పనిచేయడానికి ప్రభుత్వం మండలంలో నాలుగు క్లస్టర్‌లు ఏర్పాటు చేసింది. కస్టర్ పరిధిలో సిఆర్‌పిని నియమించింది. వీరి పరిధిలో ఐసిఆర్‌పిలను సహాయకులుగా నియమించంచింది. అలా పనిచేయడానికి 17 మందిని సిఆర్‌పిలతో మొత్తం 21 మందిని నియమాకం చేపట్టింది. వీరు గ్రామాల్లోకి వెళ్లి రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించాలి. గ్రామాల్లో ఒకటి రెండు చోట్ల తప్ప ఎక్కడా వీరి సేవలు కనిపించిన దాఖలాలు లేవు. మొదటి విడతగా పిట్టాడ, గుర్లతమ్మిరాజుపేట, ఆగూరు, మెంటాడ గ్రామాలను ఎంపిక చేశారు. రెండో విడతగా వానిజ బడేవలస, మీసాల పేట, చల్లపేట, జయతి గ్రామాలను ఎంపిక చేశారు. కెఎఫ్‌డబ్ల్యు గ్రామంగా అమరాయవలసను ఎంపిక చేశారు. సుమారుగా 200 ఎకరాల్లో సేంద్రీయ వ్యవసాయం సాగు చేస్తున్నట్లు లెక్కల్లో చూపిస్తూ వస్తున్నారు. వాస్తవంగా 20 ఎకరాల్లో కూడా చేసినట్లు ఎక్కడ కనిపించిన దాఖలాలు లేవు. సొంత గ్రామాల్లో పనిచేసిన ఐసిఆర్‌పిలకు రూ.7500, పక్క గ్రామాల్లో పనిచేసిన వారికి రూ.10,500 చొప్పున ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోంది. వీరికి జీతాలు రూపంలో ప్రభుత్వం వృథా ఖర్చు చేస్తూ వస్తుంది కానీ రైతులు మాత్రం పాత పద్ధతిలోనే రసాయనికి ఎరువులు క్రిమి సంహారక మందులు వాడుతూ సేద్యం చేస్తూ వస్తున్నారు. ఐసిఆర్‌పిలు, సిఆర్పిలకు ఇచ్చిన జీతాలు బూడిదలో పోసిన పన్నీరు గానే మిగులుతున్నాయని చెప్పక తప్పడం లేదు. రైతులు సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని రైతుల చెంతకు వచ్చి చెప్పే నాధుడు కరువయ్యారు. రెండు మూడు రోజులు ఐసిఆర్‌పిలు, సిఆర్‌పిలు గ్రామాల్లో రైతుల ఇళ్లకు వచ్చి ఆధార్ కార్డులు తీసుకుని మీరు ప్రకృతి వ్యవసాయం చేశారు అందుకే మిమ్మల్ని జాబితాలో చేర్చాలని చెప్పడంతో రైతులు మేము సేంద్రియ వ్యవసాయం చేయడం లేదని ఎదురు ప్రశ్నిస్తున్నారు. రైతులు చెప్పిన సమాధానాలకు ఐసిఆర్‌పిలు, సిఆర్‌పిలకు దిమ్మ తిరిగిపోతుంది. ఇలా సాధ్యం కాదని గ్రహించి సర్వేలో పేర్లు ఉన్న వారికి సేంద్రియ వ్యవసాయం చేసినట్లు నమోదయితే రైతుకు రెండు మూడు వేలు వస్తుందని, పొదుపు గ్రూప్ సభ్యులకు కూడా వర్తిస్తుందని నమ్మబలకడంతో పేర్లు నమోదు కాని వారు నిరాశతో తర్జన భర్జన పడుతున్నారు. అయినప్పటికీ ఎవరూ సేంద్రియ వ్యవసాయం చేసేందుకు ముందుకు రావడం లేదు. మండలంలో సేంద్రియ వ్యవసాయం వట్టి భూటకంగానే జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

తెగుళ్లకు గురైన వరి

మరో పక్క తెగుళ్ల బెడద

ప్రస్తుతం మండలంలో మానే పుండు తెగులు వరి పంటపై ఉధృతంగా ఉంది. పంట వారం పది రోజుల్లో చేతికి వస్తుందన్న తరుణంలో ఈ తెగులు ఎక్కువ ఆశించడం వల్ల ఎక్కువగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు తగ సూచనలు సలహాలు అందజేయాలని, సిఆర్‌పిలు, ఐసిఆర్‌పిల వల్ల తమకు ఎటువంటి సూచనలు అందడం లేదని రైతులు వాపోతున్నారు.

పురుగు మందు పిచికారి చేస్తున్న రైతు

రైతుల నిరాశ

ప్రజాశక్తి - సంతకవిటి

వరి పంటపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలత వల్ల పంట ధీటుగా పెరగడంతో పాటు కంకి దశ బాగుగా కనిపించడంతో రైతులుకు వరి పంట దిగుబడులపై ఆశలు చిగురించాయి. అయితే పది రోజులుగా పంటపై దోమ సోకడంతో రైతుల ఆశలు నిరాశయ్యాయి. దోమ నివారణకు వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరిగిన సంబంధిత అధికారులు కానరాకపోవడంతో పురుగు మందుల షాప్ యాజమాన్యలను ఆశ్రయిస్తున్నారు. వాళ్ళు ఇచ్చిన పురుగు మందులు వ్యవసాయంపై పిచికారి చేసినా పురుగు నివారణ జరగడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.

ఇరుకు గదుల్లోనే సచివాలయ సేవలు

- సిబ్బందికి తప్పని ఇబ్బందులు
- ప్రారంభం కాని ఉణుకూరు, రేగిడి సచివాలయాలు
- నాలుగేళ్లు గడిచిన పూర్తికాని నిర్మాణాలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని 39 గ్రామపంచాయతీలలో 25 సచివాలయాలకు అధికారులు నిధులు మంజూరు చేశారు. ఈ సచివాలయాలకు గత ప్రభుత్వ హయంలో రూ.25 నుంచి 30 లక్షల వరకు నిధులు మంజూరు చేశారు. స్థానిక నాయకుల కను సన్నాలోనే నిర్మాణాలు చేపట్టారు. కొన్ని సచివాలయాల్లో పనులు పూర్తి చేసి ప్రారంభాలు జరిగాయి. మరికొన్ని సచివాలయాల్లో స్లాబ్ స్థాయి వరకు వచ్చి పనులు నిలిచిపోయాయి. 25 సచివాలయాలలో కేవలం 9 సచివాలయాలు మాత్రమే పూర్తి చేసి ప్రారంభించారు. 16 సచివాలయాలు పూర్తి చేయక సచివాలయ ఉద్యోగులు ఇరుకు గదిలోనే విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మండలంలోని అంబాడ వెంకటాపురం సచివాలయాన్ని రూ. 26 లక్షలతో సర్పంచ్ చుక్కా వెంకటి నాయుడు పనులు చేపట్టారు. కానీ స్లాబ్ స్థాయికి వచ్చి పనులు నిలుపుదల చేశారు. చేసిన పనులకు నాణ్యతా ప్రమాణాలు లేక ఎక్కడ పడితే అక్కడ పెచ్చులుడుతున్నాయి. ప్రారంభం కాకముందే ఈ భవనం శిథిలావస్థకు చేరినట్లు కనిపిస్తోంది. సంకిలి, బూరాడ, ఉంగరాడ, సచివాలయం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఉణుకూరు, రేగిడి సచివాలయాలు పూర్తిస్థాయిగా నిర్మాణాలు చేపట్టక గాలికి వదిలేసారు. అంబకండి, చిన్న శిర్లాం, వెంకంపేట, దేవుదల, తోకలవలస సచివాలయాలు పూర్తి చేసి ప్రారంభాలు జరిగి సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న సచివాలయాలు నిధులు ఏమైనట్లు అని ఆయా గ్రామాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి అసంపూర్తిగా ఉన్న సచివాలయాలను పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలని ఆయా సచివాలయ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా ఉన్న అంబాడ వెంకటాపురం సచివాలయం

నిధులు పుష్కలంగా ఉన్నాయి..

మండలంలోని 25 సచివాలయాలకు నిధులు పుష్కలంగా ఉన్నాయి. 16 సచివాలయాలు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. ఉణుకూరు, రేగిడి పనులు ప్రారంభిం చలేదు. స్థానిక నాయకులపై ఒత్తిడి తెచ్చినా పనులు జరగడం లేదు. ప్రస్తుతం ఇన్చార్జి బాధ్యతులు చేపడుతున్నాను. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాను.

- ఇంచార్జి మండల జెఇ రియాజ్, రేగిడి



నిత్యవసరాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఒంటరి వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో వినాయక్ నగర్ వద్ద ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాధ్ హరికుమార్ ఆధ్వర్యంలో 43 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. జనసేన మండల నాయకులు రామదుర్గ దంపతులు, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ చేతులు మీదుగా ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ మాట్లాడుతూ వ్యాపారవేత్త గోపి కుమారుడు మనోజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా పదివేల రూపాయలు ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జనసేన మండల నాయకులు రామదుర్గ 125 కేజీల బియ్యం అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రామదాసు కాశి, మల్లువలస శ్రీను, అప్పారావు, జిన్నల శ్రీను, బంధం సత్యనారాయణ, కోటి, ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి, ట్రెజరర్ విశ్వనాథ శ్రావణ్ కుమార్, సభ్యుల గోవిందరావు, నగేష్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

17న బాలల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఈనెల 17న బాలల దినోత్సవం వేడుకలు నిర్వహించనున్నట్లు ఆనందోబ్రహ్మ డాన్స్ అకాడమీ అధ్యక్షులు ఎం.విజయమోహన్, శ్రీకళాభారతి ప్రధాన కార్యదర్శి ఎన్. వేణుగోపాల్ తెలిపారు. బాలల దినోత్సవ వేడుకలపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల బాలికల్లో సృజనాత్మక, కళా నైపుణ్యాలు, ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు ఆనందోబ్రహ్మ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు నుండి పదో తరగతి లోపు విద్యార్థులకు వెస్ట్రన్ సిటీ డాన్స్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు ఈనెల 10 లోగా 9440744741కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేస్తామని చెప్పారు. సమావేశంలో సభ్యులు పుల్లెల శ్రీనివాసరావు, డి.వి.అప్పారావు, బి.భవాని, టి.కమల్ కుమార్, కె.కొండల రావు, సి.హెచ్.అప్పలనాయుడు, పి.రవి కుమార్, గోన భాస్కర రావు పాల్గొన్నారు.

బాలికల ప్రతిభ

ప్రజాశక్తి- గజపతినగరం

స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థునుల జిల్లా స్థాయి సైన్స్ పెయిర్‌లో రెండో స్థానం సాధించారు. వీరు తయారు చేసిన విజ్ఞాన ప్రదర్శన జిల్లాస్థాయిలో రెండవ బహుమతి గెలుచుకుంది. విజయనగరం కోటలో నవంబర్ 1న జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శన జరిగింది. యూత్ ఫెస్టివల్ సందర్భంగా సెట్విజ్ ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీన నిర్వహించిన ఈ విజ్ఞాన ప్రదర్శనలో, జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో గజపతినగరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయి శృతి, జస్మిత ప్రాజెక్టును తమ గైడ్ సుజాత సహకారంతో సమర్పించి రెండవ బహుమతిని గెలుచుకున్నారు. ఇందుకుగాను రూ. 5వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిప్పాడ రమేష్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.కోటలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన

ప్రజాశక్తి- శృంగవరపు కోట

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసినప్పటికీ ఎస్ కోటలో ఎన్నికల నిబంధనలపై అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ దృష్ట్యా ఎన్నికల నిబంధనలు అమలు అవుతాయని ఎన్నికల కమిషన్ తెలియజేసినప్పటికీ పట్టణంలోనూ, మండలములోనూ రాజకీయ నాయకుల విగ్రహాలకు కనీసం ముసుగులు తొడగలేదు. వివిధ చోట్ల ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను కూడా నేటి వరకు తొలగించకపోవడంపై ఎన్నికల సంఘం ఆదేశాలను స్థానిక మండల నాయకులు బేకాతర్ చేస్తున్నారంటూ పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ఎన్నికల నియమావళిని పాటిస్తూ ఎన్నికల కోడ్ ఉల్లంఘన లేకుండా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడగాలని, కూడళ్లలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

పట్టణంలో ముసుగులు లేకుండా దర్శనమిస్తున్న నాయకుల విగ్రహాలు

కడుపునొప్పితో యువకుడు మృతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ లచ్చన్న దొరపాలెం గ్రామానికి చెందిన గేదల బంగారు బాబు (25) కడుపునొప్పి తాళలేక శనివారం రాత్రి మరణించాడని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం రాత్రి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో పట్టణంలోని సామాజిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యంలో మరణించాడన్నారు. కుటుంబానికి చేదోడు వాదోడుగా, పెద్దదిక్కుగా ఉండే బంగారు బాబు మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. బంగారు బాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు జరత గౌరీసు డిమాండ్ చేశారు. బంగారు బాబు మరణంతో లచ్చన్న దొరపాలెం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మగ్గూరు సమీపాన హోంగార్డు మృతి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మగ్గూరు సమీపంలోని మడ్డువలస ప్రాజెక్టు డైక్ వద్ద శివ్వాం గ్రామానికి చెందిన హోంగార్డు పొదిలాపు అప్పలనాయుడు (53) మృతి చెందినట్లు ఎఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు. శ్రీకాకుళం పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న అప్పలనాయుడు స్వగ్రామం శివ్వాం. ఈనెల రెండో తేదీన విధులకు హాజరయ్యేందుకు వెళ్లాడు. ఆదివారం ఉదయం మడ్డువలస ప్రాజెక్టు డైక్‌ని ఆనుకొని మృతి చెంది ఉండటాన్ని చూసి స్థానికులు సమాచారం ఇచ్చారు. మద్యానికి బానిసై అనారోగ్యానికి గురై మృతి చెంది ఉంటాడని మృతుని భార్య పొదిలాపు భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎఎస్ఐ తెలిపారు.

బియ్యం పట్టివేత

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని కొంపంగి శివారు ప్రాంతం బ్రిడ్జి వద్ద ఆదివారం ఆండ్ర పోలీసులు మాటు వేసి 900 కేజీల పిడిఎఫ్ బియ్యం ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నారు. ఆటో డ్రైవర్, 20 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఆండ్ర ఎస్ఐ కె సీతారాం తెలిపారు.

మహారాజశ్రీ చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 96/2023.

Between:
Kalisetti Padma ....Plaintiff.
And:
Uppada Venkati and others...Defendants.

ప్రకటన

పై నెంబరు దావాలో 4 & 6 ప్రతివాదులకి ప్రోసెస్ నాలుగైదు పర్యాయములు కట్టినను నోటీసులు అందనందువలన వాది కోరిన ప్రకారము పేపరు ప్రకటన ఆర్డరు వేసినారు. సదరు పేపరు ప్రకటన అంశముల ప్రకారము ఓ.యస్. 96/2023 గలది తే.18-11-2024 దీన మహారాజశ్రీ చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో వాయిదా కలదు. సదరు వాయిదాకు 4th defendant Uppada Venkati s/o Venkati, aged 30 years, Peripi Village, Cheepurupalli Mandal, Vizianagaram District and 6th defendant Sekhar s/o Ramulu, aged 35 years, Peripi Village, Cheepurupalli Mandal, Vizianagaram District పర్సనల్ ప్లీడరు గారి ద్వారా గాని **తే.18-11-2024 దీన ఉదయం గం.10-30 నిముషములకు** చీపురుపల్లి కోర్టులో హాజరు కావలసి యున్నది. లేనియెడల మీ పరోక్షములో దావా ప్రొసీడింగ్సు జరుపబడును అని ఈ ప్రకటనద్వారా తెలియజేయడమైనది.

సి.హెచ్.వేణుగోపాలరావు
న్యాయవాది, చీపురుపల్లి,
సెల్ : 9440200282

విజయనగరం.
తే 3-11-2024ది